నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంచిర్యాల గురువారం 28 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మొక్కలను సిద్ధం చేయాలి

మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, మార్చి 27 : జిల్లాలో లక్ష్యాలకు అనుగుణంగా నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, అటవీ శాఖ అధికారి శివ్ ఆశీష్‌సింగ్‌తో కలిసి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కల సంరక్షణకు షెడ్‌నెట్స్ ద్వారా నీడ, నీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. అటవీ బీట్ అధికారులు తమపరిధిలోని నర్సరీలను సందర్శించి, మొక్కల ఎదుగుదల, ఇతర అంశాలను పంచాయతీ కార్యదర్శి వద్ద ఉన్న రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. డీఆర్డీవో కిషన్, అటవీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

రూ.2.30 లక్షల నగదు స్వాధీనం

నగదును స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ సాగర్

వాంకిడి, మార్చి 27: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద బుధవారం ఉదయం వాహనాల తనిఖీల్లో భాగంగా రూ.1లక్షా 30 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన రాంబారే చంద్రషుడ్ తన కారులో హైదరబాద్‌కు వెళ్తుండగా, నగదుకు సంబంధించి సరైన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఏఎస్ఐలు పోశెట్టి, ఉల్లాస్, సిబ్బంది ఉన్నారు.

సిర్పూర్(టీ), మార్చి 27 : మండలంలోని వెంకట్రావ్ పేట్ గ్రామ సమీపంలో ఎస్ఐ దీకొండ రమేశ్ ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో భాగంగా మహబూబాబాద్ జిల్లా గార్లకు చెందిన గంగులోతు రాందాస్ వద్ద ఎటువంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ. 1లక్ష నగదును పట్టుకున్నారు. నగదును సీజ్ చేసి, ఎఫ్ఎస్‌టీ టీంకు అప్పగించినట్లు తెలిపారు.

వంద శాతం వసూలయ్యేనా..

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ఆస్థి పన్ను రూ.3.66 కోట్లు లక్ష్యం

- ఈ నెల 26 వరకు రూ.2.14 కోట్లు వసూలు
- ఇంకా రూ.1. 52 కోట్ల బకాయిలు
- మిగిలింది నాలుగు రోజులే

కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం

కాగజ్‌నగర్, మార్చి 27: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పన్నుల వసూలులో లక్ష్యం చేరుకోవడం కష్టంగానే కనిపిస్తున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను 58.52 శాతం మాత్రమే వసూలు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో పూర్తి స్థాయిలో పన్నులు వసూలవడం కష్టంగానే కనిపిస్తున్నది. రోజూ రూ. 30 లక్షలకు పైగా వసూలు చేస్తే తప్ప, వంద శాతం చేరుకోవడం అసాధ్యం. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డులు ఉండగా, 15 వేల నివాసాలు ఉన్నాయి. పట్టణంలో 7 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి జనవరి నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. సకాలంలో పన్నులు చెల్లించని వారికి రెడ్ నోటీసులు జారీ చేయడంతో పాటు సామగ్రి జప్తు చేస్తామని హెచ్చరిస్తున్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో కొట్టు మిట్టాడుతుంటే, పన్నులు వసూలు కాకపోవడం మరింత ఇబ్బందుల్లోకి నెడుతున్నది.

పన్నులు వసూలు చేస్తున్న సిబ్బంది

లక్ష్యం రూ.3.66 కోట్లు..

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో రూ.3.66 కోట్లు ఆస్తి పన్ను వసూలు లక్ష్యంగా ఉంది. ఇందులో ఈ నెల 26 వరకు రూ.2.14 కోట్లు వసూలు చేయగా, రూ.1.52 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం రాయితీ కల్పించినప్పటికీ వంద శాతం లక్ష్యం చేరుకోవడం అసాధ్యంగానే కనిపిస్తున్నది.

మూడు నెలలుగా వేతనాల్లేవ్..

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 150 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ సప్లయ్, విద్యుత్ సరఫరా, శానిటేషన్, బిల్ కలెక్టర్, తదితర విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రగతి నిధులు రావడంతో, అందులోంచి వేతనాలు చెల్లించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో జీతాలు చెల్లించలేని దుస్థితిలో కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఉంది.

సకాలంలో ఆస్తి పన్ను చెల్లించాలి

-అంజయ్య, మున్సిపల్ కమిషనర్, కాగజ్‌నగర్

ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి. ఇప్పటికే పట్టణంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డుల్లో 7 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పన్నుల వసూలు చేపడుతున్నాం. ఆస్తి పన్ను వసూలు లక్ష్య ం చేరుకునేందుకు కృషి చేస్తున్నాం.

దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారి జలీల్

తూకాలు సరిగా లేకుంటే చట్టపర చర్యలు

లీగల్ మెట్రాలజీ అధికారులు

సిర్పూర్(టీ), మార్చి 27 : తూకాలు తగ్గించి, వినియోగదారులను మోసం చేసే దుకాణ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ఎంఏ జలీల్ అన్నారు. మండల కేంద్రంలోని పలు కిరాణా దుకాణాల్లో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ఏంఎ జలీల్ ఆధ్వర్యంలో బుధవారం అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు కిరాణా దుకాణాల్లో బియ్యం బస్తాలను తూకం వేసి పరిశీలించారు. స్థానిక బస్టాండ్ ప్రాంతంలోని నౌషాద్, పైడి గిరీశ్ కిరాణా దుకాణాల్లో తూకాలు వేయగా, 26 కేజీల బియ్యం బస్తాల్లో తేడాలు అధికారులు గుర్తించారు. ఒక్కో బియ్యం బస్తాలో కిలోకు పైగా తేడాలు రావడంతో నౌషద్, గిరీశ్‌లపై కేసు నమోదు చేసి, ఒక్కొక్కరికీ రూ 15వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు తూకాలు సరి చూసుకొని కొనుక్కోవాలని సూచించారు.

26 కేజీల బియ్యం బస్తాలో కిలో 78 గ్రాములు తక్కువగా చూపిస్తున్న తూకం

షెట్టర్‌కు తాళం వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పన్ను చెల్లించని దుకాణానికి తాళం

వెంటనే రూ. 1.41 లక్షలు చెల్లించిన యజమాని

మంచిర్యాలటౌన్, మార్చి 27: ఆస్తిపన్ను చెల్లించని దుకాణానికి మున్సిపల్ సిబ్బంది తాళం వేశారు. వెంటనే స్పందించిన భవన యజమాని ఐత శ్రీనివాస్ పన్ను చెల్లించడంతో తాళాలు తెరిశారు. మెయిన్‌రోడ్డులో మోర్ మార్కెట్‌ను నిర్వహిస్తున్న భవనానికి సంబంధించిన ఆస్తిపన్ను రూ. 1.41 లక్షలు ఉండడంతో, పలుమార్లు మున్సిపల్ సిబ్బంది యజమానిని కలిసి పన్ను చెల్లించాలని కోరారు. అయినా కాలయాపన చేస్తుండడంతో, షెట్టర్లకు మున్సిపల్ సిబ్బంది తాళాలు వేశారు. మూడు గంటల వ్యవధిలో పన్ను మొత్తాన్ని చెల్లించడంతో తాళాలు తెరిచారు. మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్, రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ మజార్, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

చట్టం నుంచి తప్పించుకోవడం అసాధ్యం

- సత్ప్రవర్తనతో ఉంటే రౌడీషీటర్లకు మేలు
- రామగుండం సీపీ ఎం శ్రీనివాస్

మంచిర్యాల ఏసీసీ, మార్చి 27: చట్టం నుంచి తప్పించుకోవడం అసాధ్యమని, బాధ్యతగా మెలగాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లాలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ బుధవారం డీసీపీ అశోక్ కుమార్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ జిల్లాలో 218 మంది రౌడీషీటర్లు ఉన్నారని తెలిపారు. గతంలో నేరాలకు పాల్పడిన వారు, సమాజంలో మంచి నడవడికతో కొనసాగాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రస్తుతం విచారణ జరుగుతున్నదని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. నేరం చేసే ముందు, కుటుంబాలు, పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించాలన్నారు. భూ కబ్జాలు, ప్రజలను భయపెట్టడం, ఆస్తుల ధ్వంసం వంటి చట్ట విరుద్ధ పనులకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. సత్ప్రవర్తన కలిగి ఉంటే, రౌడీ షీట్ తొలగించేందుకు కూడా అవకాశం ఉంటుందని తెలిపారు. రౌడీ షీటర్ల నేర చరిత్ర, ప్రస్తుత జీవన విధానం, ఉద్యోగ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ బన్సీలాల్, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరేశ్ కుమార్, ఎస్ఐలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే

పోషణ లోపాన్ని గుర్తించాలి

- పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి
- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 27: పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని గుర్తించి, అరికట్టాల్సిన అవసరం ఉందని కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే సూచించారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడుతూ ఆరేండ్లలోపు చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు అందరూ కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. లింగ సమానత్వంపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. బాల్యం నుంచే పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని, ప్రస్తుతం వారిపై మొబైల్ ఫోన్ల ప్రభావం ఎక్కువవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే మార్పు ముందుగా ఇంట్లో తల్లిదండ్రులు, పెద్దవారి నుంచి రావాలని సూచించారు. పిల్లల ప్రగతికి బాటలు వేయాలంటే పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన అలవాట్లు, విద్య తోనే సాధ్యమని తెలిపారు. డీడబ్ల్యూవో భాస్కర్, సీడీపీవో సాదియా, కాగజ్‌నగర్ సీడీపీవో సురేఖ, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మార్చి 27: జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా అధికారులు, వైద్యులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే సూచించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం భట్ తో కలిసి వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోలియో కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పని చేసి నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవడం అభినందనీయమన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలతో మమేకమై స్నేహపూర్వక వాతావరణంలో వైద్య సేవలు, చికిత్సలు అందించాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు, లక్ష్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి తగు సూచనలు సలహాలు అందించారు. గ్రామ పంచాయతీల పరిధిలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. వేసవి నేపథ్యంలో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దౌత్రే

సమావేశాన్ని విజయవంతం చేయాలి

ఎమ్మెల్సీ దండె విఠల్

మండల కేంద్రంలో కార్యకర్తలతో కలిసి టీ తాగుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

బెజ్జూర్, మార్చి 27 : రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నేడు (గురువారం) కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి నాయకులు,కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి దండె విఠల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం బెజ్జూర్ మండలానికి వచ్చారు. కార్యకర్తలతో కలిసి సమావేశంపై చర్చించారు. సమావేశానికి ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, ఉమ్మడి ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జోగు రామన్నతో పాటు ఇటీవల బీఎస్పీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సమావేశానికి హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బీఎస్పీ కార్యకర్తలు భారీ సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరుతారని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారని వివరించారు. బీఆర్ఎస్ నాయకులు సామల రాజన్న, ఖాజా సమీయొద్దీన్, చిప్పకుర్తి దేవాజీ, తేలి రాజేశ్, నీలయ్య, ఆనంద్ రావు, రౌతు లచ్చయ్య, మెరుగు రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి

-అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి

సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

మంచిర్యాల అర్బన్, మార్చి 27 : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మంచిర్యాల పట్టణంలోని ఓ కన్వెన్షన్ హాల్లో జరిగిన అల్ఫోర్స్ ఇంటర్నేషనల్ స్కూల్ మొదటి వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు చదువుతోపాటు సంస్కృతీసంప్రదాయాలను తెలుసుకోవాలన్నారు. 30 ఏళ్లుగా నాణ్యమైన విద్యను అందించడం వల్లే తమ విద్యాసంస్థ ఉన్నత స్థాయిలో ఉన్నదని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఉంచిన నమ్మకం వల్లే ఇదంతా సాధ్యమైందన్నారు. కాలేజీ రోడ్‌లో మరో పాఠశాలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. విద్యా సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలను పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవంతి వివరించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ చూపిన విద్యార్థులకు చైర్మన్ నరేందర్ రెడ్డి బహుమతులు అందజేశారు.జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పాఠశాల వైస్‌ప్రిన్సిపాల్ వెంకటేశ్,ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి..

- అధికారులు అంశాలపై అవగాహన ఉండి బాధ్యతతో పనిచేయాలి..
- సమస్యాత్మక కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలి..
- పార్లమెంట్ ఎన్నికలపై కో-ఆర్డినేషన్ భేటీలో జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా, ఎస్పీ

ఎదులాపురం, మార్చి 27 : ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు బాధ్యతతో పని చేయాలని, వారికి సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. బుధవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికలపై కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజర్షి షా మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, ఖానాపూర్, ఆసిఫాబాద్, సిర్పూర్ (టి) అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. వీటి పరిధిలో 2,111 పోలింగ్ కేంద్రాలు.. 2,638 బ్యాలెట్ యూనిట్స్.. 2,638 కంట్రోల్ యూనిట్స్.. 2,908 వీవీ ప్యాడ్స్, మొబైల్ కనెక్టివిటీ 2,039.. షాడో పోలింగ్ కేంద్రాలు సిర్పూర్ 11, ఆసిఫాబాద్ 28, ఖానాపూర్‌లో 9, ఆదిలాబాద్ 9, బోథ్ 14, నిర్మల్‌లో 1 ఇలా 72 ఉన్నాయన్నారు.

ఏప్రిల్ 3,4 తేదీల్లో శిక్షణ

పోలింగ్ విధులలు నిర్వహించే సిబ్బందికి ఏప్రిల్ 3,4 తేదీల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణతోపాటు ఫామ్-12డీ కౌంటర్ ఏర్పాటు చేయాలని, ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరు ఫామ్-12డీ ఉపయోగించుకోవాలన్నారు.కౌంటింగ్ కేంద్రాల్లో సివిల్ వర్క్స్ ఏమైనా ఉంటే పూర్తి చేయాలని, స్ట్రాంగ్ రూ మ్, టేబుల్స్, బందోబస్తు ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలన్నారు. అలాగే సెక్టోరల్ అధికారులకు టీం వైస్‌గా శిక్షణ ఇవ్వాలన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు

- ఎస్పీ గౌష్ ఆలం

ఇంటర్ స్టేట్ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఫ్లాగ్ మా ర్చ్‌లు నిర్వహించి ప్రజలను చైతన్య పర్చాలని సూచించారు. సిగ్నల్ వ్యవస్థ లేనటు వంటి షాడో పోలింగ్‌స్టేషన్ ప్రాంతాలను గుర్తించి కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్టం చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ సెంటర్స్, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతాను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇతర రాష్ట్రాల పోలీస్ సిబ్బందితో సమన్వయం కోసం ఇంటర్ స్టేట్ బోర్డింగ్ జిల్లాలతో మీటింగ్‌లను నిర్వహించడం జరిగిందన్నారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, నిర్మల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, ఆదిలాబాద్ రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రం భీం జిల్లాల ఏఎస్‌డీఎస్పీ, డీఎస్పీలు, పోలీస్ సిబ్బంది, ఆర్డీవోలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

- కాగజ్‌నగర్‌లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు
- సమన్వయకర్త ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో నిర్వహణ
- పార్టీలో పెద్ద ఎత్తున బీఎస్పీ కార్యకర్తల చేరికకు రంగం సిద్ధం
- హాజరుకానున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కు

సమావేశానికి ఏర్పాట్లు చేసిన కార్యకర్తలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ప్రచారాన్ని ప్రారంభించింది. దీనిలో భాగంగా గురువారం సిర్పూర్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని కాగజ్‌నగర్‌లో నిర్వహించనుంది. సిర్పూర్ నియోజకవర్గ సమన్వయకర్త ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని కార్యకర్తలతో సన్నాహక సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ మంత్రి జోగురామన్న, ఆదిలాబాద్ అభ్యర్థి ఆత్రం సక్కు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలోనే బీఎస్పీ నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరనున్నారు.

3 వేల మందితో సన్నాహక సమావేశం...

కాగజ్‌నగర్‌లోని సంతోష్ ఫంక్షన్ హాల్‌లో సుమారు 3 వేల మంది పార్టీ కార్యకర్తలతో ఈ సన్నాహక సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బీఎస్పీ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన తరువాత నియోజకవర్గంలో రాజకీయంగా చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో కాగజ్‌నగర్‌లో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ సన్నాహక సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. దీనికి అనుగుణంగా భోజన వసతి కల్పించనున్నారు. సమాశాన్ని విజయవంతం చేసేందుకు శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి.

విజయవంతం చేయాలి

-దండె విఠల్, ఎమ్మెల్సీ, సమన్వయ కర్త

కాగజ్‌నగర్‌లో నిర్వహించనున్న సిర్పూర్ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమాశాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలి. సుమారు 3 వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నాం. గ్రామస్తాయి నుంచి కార్యకర్తలు పాల్గొంటారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఎస్పీ నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరబోతున్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తాం.

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

రీజనల్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ షాహిద్ మసూద్

మాట్లాడుతున్న షాహిద్ మసూద్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మార్చి 27: ఆసిఫాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి అధికారులు, ప్రజ ల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు వరంగల్ రీజినల్ మున్సిపల్ అడ్మనిస్ట్రేషన్ అధికారి షాహిద్ మసూద్ తెలిపారు. కమిషనర్ భుజంగ్ రావు తో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి విషయంలో అవకతవకలు తన దృష్టికి వస్తే, తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొత్త కార్యాలయం ఏర్పాటుకు ఉన్నతాధికారులకు వివరించినట్లు తెలిపారు. డీఈ మసూద్ అలీ తదితరులున్నారు.